జీఆర్ఎల్ ఎప్పుడిస్తారు?

- 8 నెలలుగా గురుకుల అభ్యర్థుల ఎదురుచూపులు
- 90 రోజుల్లో వెల్లడిస్తామని చెప్పి ఇప్పటికీ ట్రిబ్ మౌనం
- ఆర్టీఐలో దరఖాస్తు చేసినా సమాధానం చెప్పని వైనం
- తప్పులను కప్పిపుచ్చుకునేందుకేనని అభ్యర్థుల అనుమానం
- జీఆర్ఎల్, మార్కులను వెంటనే ప్రకటించాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గురుకుల ఉద్యోగం కోసం పరీక్ష రాసిన అభ్యర్థుల పరిస్థితి దయనీయంగా మారింది. అసలు ఆ ఉద్యోగాలకు వారు ఎందుకు ఎంపిక కాలేదో ఇప్పటికీ తెలియడం లేదు. ఈ రాత పరీక్షను నిర్వహించిన తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ట్రిబ్) ఇప్పటివరకు జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (జీఆర్ఎల్)ను ప్రకటించక పోవడమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో అభ్యర్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. వారు ఎక్కడ ఎలాంటి పొరపాట్లు చేశారో? ఏ కారణం వల్ల ఉద్యోగాలు రాలేదో తెలియక మథనపడుతున్నారు. జీఆర్ఎల్‌ను ప్రకటించాలని అభ్యర్థులు కోరుతున్నప్పటికీ ఏ రిక్రూట్‌మెంట్ బోర్డులోనూ లేనివిధంగా మొత్తం నియామక ప్రక్రియ పూర్తయ్యేవరకూ ప్రకటించబోమని ట్రిబ్ తేల్చిచెప్తుండటం అనేక అనుమానాలకు తావిస్తున్నది. దీంతో పారదర్శకతను పాటించడమంటే ఇదేనా? అని అభ్యర్థులు నిలదీస్తున్నారు. ఇతర బోర్డులు పూర్తిగా పారదర్శకంగా వ్యవహరిస్తుంటే అందుకు విరుద్ధంగా ట్రిబ్ వ్యవహరిస్తున్నదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జీఆర్ఎల్‌పై ఎందుకీ గోప్యత?

సాధారణంగా రాతపరీక్షకు సంబంధించి తొలుత సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఆహ్వానిస్తారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు సంబంధించి 1:1 నిష్పత్తిలో జాబితాను ప్రకటిస్తారు. ఆ సందర్భంగా పోస్టుకు ఎంపికైన అభ్యర్థి హాల్‌టికెట్ నంబర్, రాతపరీక్షలో సాధించిన జనరల్ ర్యాంకు, అభ్యర్థికి వచ్చిన మార్కులను ప్రకటిస్తారు. నియామక పత్రాలను అందించిన తర్వాత మొత్తంగా ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్లు, రాతపరీక్షలో వారికి వచ్చిన మార్కులు, ఓవరాల్‌గా సాధించిన జనరల్ ర్యాంకులు, ఏ రిజర్వేషన్ క్యాటగిరీలో పోస్టులకు ఎంపికయ్యారు? తదితర వివరాలన్నింటి జాబితాను బోర్డు సైట్‌లో పొందుపరుస్తారు. కానిస్టేబుళ్ల నియామకాల కోసం ఇటీవల పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు రాతపరీక్షను నిర్వహించింది. ఆ వెంటనే ఫలితాలతోపాటు దాదాపు లక్షల మంది అభ్యర్థుల జీఆర్ఎల్ జాబితాను ప్రకటించింది. గ్రూప్-4 పోస్టులకు సంబంధించి టీజీపీఎస్సీ కూడా ఇదే విధానాన్ని పాటించింది. ఇవే కాకుండా అన్ని రిక్రూట్‌మెంట్ బోర్డులు సైతం అభ్యర్థుల తుదిఫలితాలతోపాటు జీఆర్ఎల్‌ను వెంటనే ప్రకటిస్తున్నాయి. 2018, 2019లో ట్రిబ్ సైతం ఈ విధానాన్ని పాటించింది. కానీ, ఇటీవల చేపట్టిన నియామకాలకు సంబంధించిన జీఆర్ఎల్‌ను మాత్రం నెలలు గడుస్తున్నా బహిర్గతం చేయడం లేదు. ప్రస్తుతం భర్తీ చేసిన పీజీటీ, పీడీ, లైబ్రేరియన్ పోస్టులు మినహా మిగతా పోస్టులకు సంబంధించిన అభ్యర్థులకు ఆ వివరాలను పూర్తిస్థాయిలో వెల్లడించలేదు. డీఎల్ పోస్టులకు సంబంధించి పేపర్-1, డెమో మార్కులను మాత్రమే అభ్యర్థుల ఐడీలో వెల్లడించింది. పేపర్-2 మార్కులను మాత్రం ఇప్పటికీ ప్రకటించలేదు. అదేవిధంగా జేఎల్, పీజీటీ పోస్టులకు సంబంధించి పేపర్-1, పేపర్-2, డెమో మార్కులను ప్రకటించినప్పటికీ పేపర్-3 మార్కులను ఐడీల్లో పొందుపరచలేదు. ఇక టీజీటీకి సంబంధించిన 3 పేపర్లలో ఒక్క పేపర్ మార్కులను కూడా అభ్యర్థుల వ్యక్తిగత ఐడీల్లో పొందుపరచకుండా పూర్తి గోప్యతను పాటిస్తున్నది.

అక్రమాలు బయటపడతాయనేనా?

గురుకుల పోస్టుల భర్తీకి ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించడం మొదలుకొని ఆ తర్వాత సర్టిఫికెట్ల వెరిఫికేషన్, డెమోల నిర్వహణ వరకు ఏ ఒక్క అంశంలోనూ ట్రిబ్ పారదర్శకత పాటించలేదని అభ్యర్థులు గత 9 నెలల నుంచి ఆరోపిస్తున్నారు. ఒకే రోజులో అర్ధరాత్రి వరకు హడావుడిగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను నిర్వహించడంతో అనేక తప్పులు దొర్లాయని నిప్పులు చెరుగుతున్నారు. ఈ నియామక ప్రక్రియపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఇప్పటికే ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, జేఎల్ బోటనీ, జువాలజీ, టీజీటీ, పీజీటీకి చెందిన అభ్యర్థులు కోర్టులను ఆశ్రయించారు. ప్రస్తుతం ఆయా కేసుల విచారణ కొనసాగుతున్నది. జీఆర్ఎల్‌ను ప్రకటిస్తే కేసుల సంఖ్య మరింత పెరగవచ్చని, అందుకే వ్యక్తిగత ఐడీల్లో మార్కులను ప్రకటించేందుకు ట్రిబ్ జంకుతున్నదని తెలుస్తున్నది.

సిటీ గస్తీ.. పోలీసుల కుస్తీ

- నేడు మిలాద్ ఉన్ నబీ.. రేపు గణేశ్ నిమజ్జనం, ప్రజాపాలన, తెలంగాణ విమోచన దినోత్సవాలు
- కత్తి మీద సాములా మారిన హైదరాబాద్ బందోబస్తు
- రెండు రోజులు నిరంతరంగా పోలీసుల పహారా
- సిబ్బందికి హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ దిశానిర్దేశం

పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): గణేశ్ నిమజ్జనం ఫైనల్ డేకు హైదరాబాద్ పోలీసులు సిద్ధమవుతున్నారు. ఈ సారి సోమవారం మిలాద్ ఉన్ నబీ, మంగళవారం నిమజ్జన శోభాయాత్ర ఉండగా, 17న ప్రభుత్వం ప్రజాపాలన అంటూ పబ్లిక్ గార్డెన్‌లో, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవమంటూ పరేడ్ గ్రౌండ్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. దీంతో 48 గంటల పాటు హైదరాబాద్ పోలీసులు కంటిమీద కునుకులేకుండా విధులు నిర్వహించాల్సి వస్తుంది. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం పోలీసులకు కత్తి మీద సాముగా మారింది. గత ఏడాది మిలాద్ ఉన్ నబీ, గణేశ్ నిమజ్జనం ఒకే రోజు వచ్చినా పోలీస్ వ్యవస్థ ముందుచూపుతో వ్యవహరించి రెండు పండుగలు ఒకే రోజు కాకుండా చర్యలు తీసుకున్నది. అయితే ఈ సారి కూడా అలాంటి పరిస్థితే ఉన్నా.. అదనంగా సెప్టెంబర్ 17 వచ్చింది. కేంద్రం ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమాలకు కేంద్రమంత్రులు, బీజేపీ శ్రేణులు హాజరవుతాయి. ప్రజాపాలనకు సీఎం హాజరయ్యే అవకాశాలున్నాయి. దీంతో అన్ని కార్యక్రమాలకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాల్సి ఉన్నది. నిమజ్జనాలు బుధవారం ఉదయం వరకు జరిగే అవకాశాలుంటాయి. దీంతో సోమవారం ఉదయం పోలీసుల పహారా మొదలైతే.. బుధవారం ఉదయం వరకు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది.

48 గంటలు అప్రమత్తం: సీవీ ఆనంద్

సిటీ పోలీసులు బందోబస్తులో ఫైనల్ ఫేజ్‌లోకి వచ్చేశారని, ఇక 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలంటూ డీసీపీ, ఎస్‌హెచ్‌లో, పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బందితో సీపీ సీవీ ఆనంద్ ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ఆదివారం రాత్రి నుంచే మిలాద్ ఉన్ నబీ ప్రారంభమవుతుంది. 17న నిమజ్జనంతో పాటు పబ్లిక్ గార్డెన్స్, పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించటాన్ని చాలెంజ్‌గా తీసుకోవాలి. మిక్స్‌డ్ కమ్యూనిటీ ఉన్న ప్రాంతాలలో బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బందిని పెంచాలి. ఎప్పటికప్పుడు ఇంటలిజెన్స్‌తో క్షేత్రస్థాయిలో జరిగే ఘటనలను తెలుసుకుంటూ అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. క్రిటికల్ జంక్షన్స్, క్రాస్‌రోడ్స్‌లో తగిన విధంగా ఏర్పాట్లు చేయాలి. బషీర్‌బాగ్ చౌరస్తా, ఎంజే మార్కెట్‌లో చాలా కీలకం. కమ్యూనికేషన్ సిస్టం బాగుండాలి. చెకింగ్స్, సోషల్‌మీడియా మానిటరింగ్, షీ టీమ్స్ పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి. డ్రోన్ కెమెరాలు, మౌంటెడ్ కెమెరాలు, కెమెరా మౌంటెడ్ వాహనాలను ఏర్పాటుచేస్తున్నాం' అని వివరించారు. 19న జరిగే మిలాద్ ఉన్ నబీ ర్యాలీపైనా సీపీ సిబ్బందితో మాట్లాడారు. సమావేశంలో అదనపు సీపీలు విక్రమ్‌సింగ్‌మాన్, విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'గుట్ట' ప్రసాద విక్రయాలకు క్యూఆర్ కోడ్

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 15: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రసాదాన్ని మరింత పాదర్శకతతో విక్రయించే ప్రక్రియను దేవస్థానం ఆదివారం ప్రారంభించింది. గతంలో మ్యానువల్ టికెట్ పద్ధతికి స్వస్తి పలుకుతూ కంప్యూటరైజ్డ్ టికెట్‌తో పాటు క్యూఆర్ కోడ్ పద్ధతిని అమలు చేస్తున్నది. దీనికి సంబంధించిన ట్రయల్ రన్ కొనసాగుతున్నది. ప్రస్తుతం ఉదయం సమయంలో విక్రయించే దద్దోజనం, కట్టె పొంగలి, కేసరి బాత్ ప్రసాదాలకు మాత్రమే మ్యానువల్ టికెట్లతో విక్రయిస్తున్నారు. రూ.30 లడ్డూలు, రూ.150 అభిషేకం లడ్డూ, పులిహోర, వడ, మిల్లెట్ లడ్డూలను క్యూఆర్ కోడ్ కలిగిన కంప్యూటరైజ్డ్ టికెట్లతో విక్రయాలు చేపట్టారు. కొండపైన శివాలయం ఎదురుగా టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రసాదాల కంప్యూటరైజ్డ్ టికెట్లను విక్రయిస్తున్నారు. భక్తులు క్యూఆర్ కోడ్ కలిగిన టికెట్‌తో ప్రసాద కౌంటర్ల వద్దకు వెళ్లాలి. అక్కడ కౌంటర్‌లో దేవస్థాన సిబ్బంది టికెట్‌ను స్కాన్ చేస్తే.. ఎన్ని రకాల ప్రసాదాలు, వాటి సంఖ్య వివరాలు స్క్రీన్‌లో చూసి అందజేస్తున్నారు. మొత్తం 5 కౌంటర్లలో ఈ విక్రయాలు కొనసాగిస్తున్నారు.

తీరిన గడువు.. పూర్తికాని భూసేకరణ!

- ట్రిపుల్ ఆర్ భూసేకరణపై తొలగని ప్రతిష్ఠంభన
- ఉత్తర భాగంలో ఇంకా 20% సేకరణ మిగులు
- బలవంతంగా సేకరించేందుకు అధికారుల సన్నాహాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) ఉత్తర భాగం భూసేకరణ కోసం ప్రభుత్వం నిర్దేశించుకున్న గడువు ఆదివారంతో పూర్తయింది. కానీ, పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగానే ఉన్నది. ఆరు నెలల క్రితం నాటి పరిస్థితే నేటికీ కొనసాగుతున్నది. ఇంకా 20% భూమిని సేకరించాల్సి ఉన్నది. ఈ భూసేకరణకు జాతీయ రహదారుల శాఖ నోటిఫికేషన్ జారీచేసి చేతులు దులుపుకోవడం, రైతుల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకత, కోర్టు కేసుల వల్ల ఒక్క అడుగు కూడా ముందుకు సాగడం లేదు. ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ హయాంలోనే ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలన్న పట్టుదలతో ఉన్నది. అందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి తరచూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ భూసేకరణను వేగవంతం చేయాలని ఆదేశిస్తున్నారు. సెప్టెంబర్ 15లోగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ఆగస్టులో గడువు నిర్దేశించారు. మొత్తం 348 కి.మీ. పొడవైన ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి దాదాపు 10 వేల ఎకరాల భూములు అవసరమవుతాయి. అందులో 158.65 కి.మీ. పొడవైన ఉత్తర భాగం నిర్మాణానికి సుమారు 4,600 ఎకరాలు సేకరించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 3,500 ఎకరాలు మాత్రమే సేకరించారు. మిగిలిన 1,000 ఎకరాల్లో దాదాపు 200 ఎకరాలు అటవీ భూమి ఉండటంతో దానికి దీనికి ప్రత్యామ్నాయంగా మరోచోట భూములు గుర్తించారు. మిగిలిన చోట్ల భూసేకరణను వ్యతిరేకిస్తూ రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు స్టే విధించింది. భూసేకరణ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ ధరకు మూడు రెట్లు అధికంగా చెల్లించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ సిద్ధంగా ఉన్నప్పటికీ రైతులు ససేమిరా అంటున్నారు. ఈ ప్రతిష్ఠంభనను తొలగించేందుకు జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో ప్రభుత్వం అర్బిట్రేషన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలకు, ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించిన ధరలకు పొంతన లేకపోవడంతో చర్చలు ముందుకు సాగడంలేదు. ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి ఇంకా 20% భూసేకరణ పెండింగ్‌లో ఉన్నదని, ఇది పూర్తయ్యాకే టెండర్ల ప్రక్రియ చేపడతామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెప్తున్నారు.

బలవంతంగా భూసేకరణకు యత్నాలు

ట్రిపుల్‌ఆర్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ఉండటంతో నష్టపరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేసి బలవంతంగా భూములు స్వాధీనం చేసుకునేందుకు కలెక్టర్లు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. రైతులను సంతృప్తిపర్చడం సాధ్యంకాదని నిర్ధారణకు వచ్చిన అధికారులు.. చట్టంలో ఉన్న వెసులుబాటును ఆధారంగా చేసుకొని ముందుకు సాగాలని నిర్ణయించినట్టు తెలిసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంపీగా ఉన్న ప్రస్తుత రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలో భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన రైతులకు మద్దతు తెలిపారు. ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చుతామని అప్పట్లో వారికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా అధికారులు బలప్రయోగం ద్వారా భూసేకరణకు సన్నాహాలు చేస్తున్నారన్న వార్తలు రైతులకు మరింత ఆగ్రహాన్ని తెప్పిస్తున్నాయి.

ఏపీలో ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్

హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ) : అభియోగాలు ఎదుర్కొంటున్న ముగ్గురు ఐపీఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విధుల నుంచి సస్పెండ్ చేసింది. సస్పెండైన వారిలో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ మాజీ సీపీ కాంతిరాణా తాతా, విశాల్ గున్నీ ఉన్నారు. కాంతిరాణా, విశాల్ గున్నీపై ముంబైకి చెందిన నటి కాదంబరి జత్వానీని అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలుండగా, ఆంజనేయులు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి.

తిరుమల భక్తులకు దళారీ టోకరా

వస్త్రాలంకార సేవ కల్పిస్తానని మోసం

హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ) : వస్త్రాలంకార సేవల పేరుతో భక్తులను మోసగించిన దళారిపై తిరుమల రెండో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తిరుమలలో ఓ దళారి తిరుమల ఆలయంలో వస్త్రాలంకార సేవ కల్పిస్తానని చెప్పి గుంటూరు జిల్లా పట్టాభిపురానికి చెందిన భక్తులతో రూ.7లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముందస్తుగా రూ.4లక్షలు వసూలు చేసి ఆ తర్వాత అదృశ్యమయ్యాడు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

ప్రవక్త బోధనలు ప్రపంచానికి దిక్సూచి

ముస్లింలకు సీఎం రేవంత్ మిలాద్ ఉన్ నబీ విషెస్

హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): శాంతి, సోదర భావం, కరుణ, ధర్మబద్ధ జీవనాన్ని చాటిచెప్పే మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచానికి దిక్సూచి అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త జన్మదినం ముస్లింలకు ఎంతో పవిత్రమైనదని, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

బంగారమే శ్రీరామరక్ష!

ఆపత్కాలంలో ఆదుకునేది బంగారం మాత్రమే. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు ఈ పుత్తడే మీకు పరమాన్నంగా మారుతున్నది. ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి పాలైనప్పుడు ఈ గోల్డే మీకు ఆర్థికంగా ఆదుకుంటుంది. ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినప్పుడు బంగారమే శ్రీరామరక్ష. సామాన్యుడి నుంచి మొదలుకొని సంపన్నవర్గాలు కూడా ప్రతియేటా బంగారం ఎంతో కొంత కొనుగోలు చేస్తున్నారు. అక్కరకు వచ్చినప్పుడు ఈ గోల్డ్‌ను తాకట్టుపెట్టుకొని రుణాలు తీసుకుంటున్నారు. వీటి కోసం బ్యాంకులతోపాటు ఆర్థిక సేవల సంస్థలు ప్రత్యేకంగా పసిడిపై రుణాలు మంజూరు చేస్తున్నాయి. సెక్యూర్డ్ రుణాలు కావడంతో బంగారం విలువలో 80 శాతం వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయి బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు. బంగారం కడ్డీలతోపాటు ఆభరణాలు తాకట్టుపెట్టుకొని కేవలం కొన్ని నిమిషాల్లోనే రుణం పొందవచ్చును. వ్యక్తిగత రుణాలు, ఇతర రుణాలు తీసుకోవాలంటే రోజుల సమయం పడుతుంది కానీ, బంగారంపై రుణాలు తీసుకోవడం ఎంతో సులభం. పెద్దగా డాక్యుమెంట్లు లేకుండానే తీసుకోవచ్చును. తక్కువ వడ్డీకే రుణాలు తీసుకోవచ్చును. ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ రంగ బ్యాంకులు 8 శాతం మొదలు కొని 24 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. తీసుకున్న రుణాలను ఏడాదిలోగా చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే బ్యాంకులు తాకట్టు కింద పెట్టిన ఆభరణాలను జప్తు చేసుకొని వేలం వేసుకునే అధికారం ఉంటుంది. పసిడి విలువను గుర్తించడంలో ఒక్కో బ్యాంకుది ఒక్కో తీరుగా ఉంటుంది.

పసిడి రుణాలపై ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీ

బ్యాంక్	వడ్డీరేటు(శాతంలో)	ప్రాసెసింగ్ ఫీజు
కొటక్ మహీంద్రా	8 నుంచి 24 వరకు	2 శాతం+జీఎస్టీ
హెచ్‌డీఎఫ్‌సీ	8.30 నుంచి 16.55 వరకు	ఒక్క శాతం
సెంట్రల్ బ్యాంక్	8.40 నుంచి 9.25 వరకు	రుణంపై అరశాతం
యూకో	8.50	రూ.250-5 వేల వరకు
ఇండియన్ బ్యాంక్	8.80 నుంచి 9 వరకు	రుణంపై 0.56 శాతం
యూనియన్ బ్యాంక్	8.65 నుంచి 9.90 వరకు	-
ఎస్బీఐ	8.70	అర శాతం+జీఎస్టీ
ఇండస్‌ఇండ్	8.75 నుంచి 16 వరకు	రుణంపై ఒక్క శాతం
బంధన్ బ్యాంక్	8.75 నుంచి 19.25 వరకు	ఒక్క శాతం+జీఎస్టీ
బ్యాంక్ ఆఫ్ బరోడా	9.15	వర్తించే చార్జీలు+జీఎస్టీ
పంజాబ్ నేషనల్	9.25	రుణంపై 0.75 శాతం
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	9.30	రూ.500-2,000+జీఎస్టీ
ఫెడరల్ బ్యాంక్	9.49	-
కెనరా బ్యాంక్	9.60	రూ.500-5 వేల వరకు
ఐసీఐసీఐ బ్యాంక్	10	రుణంపై ఒక్క శాతం

క్రెడిట్ స్కోర్ అక్కర్లేదు..

సిబిల్ స్కోర్ లేకుండానే బంగారంపై రుణాలు తీసుకోవచ్చును. కేవలం బంగారం లేదా ఆభరణాలు తాకట్టు పెట్టుకొని రుణాలు తీసుకోవచ్చును. దీనికోసం వారి క్రెడిట్ స్కోర్ ఎంత ఉన్నదో అవసరం లేదు. 500 లోపు సిబిలి స్కోర్ ఉన్నవారు కూడా సులువుగా రుణాలు తీసుకోవచ్చును.

కావాల్సిన డాక్యుమెంట్లు

బంగారం తాకట్టుపై రుణాలు తీసుకోవడానికి పలు డాక్యుమెంట్లు అవసరం ఉంటాయి. వీటిలో ఆధార్ కార్డుతోపాటు పాన్ కార్డు, బ్యాంక్ ఖాతాతోపాటు కేవైసీ డాక్యుమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. మనం తీసుకునే బ్యాంకులోనే ఖాతా ఉండాల్సి ఉంటుంది. ఇటీవలకాలంలో బ్యాంకులతోపాటు పసిడిపై రుణాలు ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఇస్తున్నాయి.

తిరిగి చెల్లింపులు ఎలా..

బంగారంపై తాకట్టుపై రుణాలు తీసుకున్నవారు మూడు రకాలుగా తిరిగి చెల్లింపులు జరుపుకునే అవకాశాలను బ్యాంకులు కల్పించాయి. వీటిలో నెలవారి చెల్లింపుల రూపంలో చెల్లింపులు జరుపుకోవచ్చును, లేదా మూడు నెలల్లో వడ్డీతో సహా తీసుకున్న రుణాన్ని చెల్లించవచ్చును. అలాగే ఆరు నెలలు, ఏడాది కాల పరిమితితో తీసుకున్న రుణాలను వడ్డీతో కలుపుకొని చెల్లించుకోవచ్చును. ఒకవేళ ఏడాది ముగిసిన తర్వాత తీసుకున్న రుణానికి వడ్డీని చెల్లించి మళ్లీ రెన్యూవల్ చేసుకోవచ్చు.

ఫెడ్ నిర్ణయమే కీలకం..

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో సాగుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకు మద్దతు పలుకుతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో గురువారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,440, నిఫ్టీ 470 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీ ఎత్తున పుంజుకోగలిగాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,707.01 పాయింట్లు ఎగిసి 82,890.94 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 504.35 పాయింట్లు ఎగబాకి 25,356.50 దగ్గర ముగిసింది. మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ తొలిసారి 83వేల మార్కును అధిగమించింది. నిఫ్టీ సైతం నూతన గరిష్ఠాలను తాకింది. ఈ నేపథ్యంలో ఈ వారం అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం కనిపిస్తున్నది. శుక్రవారమే మార్కెట్లలో సెల్లింగ్ ప్రెషర్ ఉండటాన్ని గమనించవచ్చు. పారిశ్రామికోత్పత్తి మందగించడం, ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తున్న సంకేతాలు రావడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు బ్రేక్ వేయవచ్చన్న అభిప్రాయాలను మెజారిటీ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. పైగా సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉండటం కూడా లాభాల స్వీకరణకు తావిస్తోందంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య సమీక్ష ప్రభావం కూడా కనిపించనున్నది. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,700-25,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఏ బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

కొత్త పీపీఎఫ్ రూల్స్

అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఖాతాలను మైనర్ల కోసం కూడా తెరుచుకోవచ్చు. మారిన నిబంధనల ప్రకారం సదరు మైనర్లకు 18 ఏండ్లు నిండేదాకా ఈ ఖాతాలు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీరేటుతో కొనసాగుతాయి. మైనార్టీ తీరిన తర్వాత పీపీఎఫ్ ఖాతాగా మార్చుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇక ఒకటికి మించి పీపీఎఫ్ ఖాతాలనూ తెరుచుకోవచ్చు. అలాగే ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీం (పీపీఎఫ్) 1968 కింద క్రియాశీల పీపీఎఫ్ ఖాతాలను తెరిస్తే ఫామ్ హెచ్ ద్వారా ఖాతాదారుని నివాస హోదా గురించి అడగకపోతే పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ మార్గదర్శకాల ప్రకారం ఈ నెలాఖరుదాకా ఉండే వడ్డీరేట్లు వర్తిస్తాయి. పీపీఎఫ్ అనేది కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాధనం. అంతేగాక మదుపరులను దీర్ఘకాలిక ఆకర్షణీయ ప్రయోజనాలతో కూడిన సేవింగ్స్, పెట్టుబడులకు ప్రోత్సహించే పథకం ఇది. దీనికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులూ వర్తిస్తాయి.

షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా

లాభాలు, పరిమితులు తెలుసా?

షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా తాత్కాలిక కవరేజీని కల్పిస్తుంది. దీన్నే టర్మ్ మెడికల్ ఇన్సూరెన్స్ అని కూడా పిలుస్తారు. సాధారణంగా ఇది కొద్ది నెలల నుంచి ఏడాదిదాకే ఉంటుంది. ఎవరైతే స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలతో వచ్చే దీర్ఘకాలిక ఆరోగ్య బీమాలు కాకుండా తక్షణ కవరేజీలను కోరుకుంటారో వారినుద్దేశించినదే ఈ పాలసీ. సమగ్ర కవరేజీని కొనలేనివారికి కూడా ఇది ఉపయుక్తంగా ఉంటుంది. కంపెనీల్లో గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులు, నిరుద్యోగులకు దీని అవసరం ఎక్కువని చెప్పవచ్చు.

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ శైలి

- కేవలం కొద్ది నెలల నుంచి ఏడాది వరకే బీమా కవరేజీ.
- లాంగ్-టర్మ్ ప్లాన్లతో పోల్చితే షార్ట్-టర్మ్ ప్లాన్లకు ప్రీమియంలు తక్కువే.
- ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలకు బీమా కవరేజీ ఉండకపోవచ్చు. కొన్ని రకాల చికిత్సలకూ వీలుండదు.
- కనీస ఆరోగ్య సమాచారంతో ఈ ప్లాన్లను తీసుకోవచ్చు.
- పరిమిత స్థాయిలోనే ఈ ప్లాన్ల చెల్లుబాటు ఉంటుంది. ఎంపిక చేసిన నెట్‌వర్క్‌లో తప్ప.. అన్ని దవాఖానల్లో చెల్లవు.
- లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను రెన్యువల్ చేసుకున్నట్టుగా ఈ షార్ట్-టర్మ్ పాలసీలను రెన్యువల్ చేసుకోలేం.

చివరగా..

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లు తక్షణ అవసరాలకే పనికొస్తాయి. కాబట్టి లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకే ప్రాధాన్యం ఇవ్వాలి.

అప్పుడే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందుతాం. ప్రీమియంలు ఎక్కువైనప్పటికీ క్లెయిములు లేకపోతే కవరేజీలు పెరిగే ప్రయోజనం ఉంటుంది. మెటర్నిటీ, మెంటల్ హెల్త్ తదితర అవసరాలు, సమస్యలకూ స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్సే లాభదాయకం అని స్పష్టంగా చెప్పవచ్చు. అందుకే సమగ్ర ప్యాకేజీని తీసుకోవడం మరువద్దు.

యూబీఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం

ప్రభుత్వ రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లను ఆకట్టుకోవడానికి ప్రత్యేక డిపాజిట్ స్కీంను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 333 రోజుల కాలపరిమితితో యూనియన్ సమృద్ధి స్కీంపై అధిక వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. ఈ స్కీంలో కనీసంగా రూ.1,000 నుంచి రూ.3 కోట్ల లోపు డిపాజిట్ చేయవచ్చును. ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.40 శాతం వార్షిక వడ్డీని చెల్లిస్తున్న బ్యాంక్..సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. మెచ్యూర్ కాకముందే ఈ డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని బ్యాంక్ కల్పించింది. కానీ, ఇలా చేసుకుంటే ఒక్క శాతం వడ్డీని తగ్గి చెల్లించనున్నది. ఈ డిపాజిట్ స్కీంను ఎంచుకోవడానికి బ్యాంక్ శాఖ లేదా వెబ్‌సైట్ ద్వారా డిపాజిట్ చేయవచ్చును.